క్లుప్తంగా

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



కాశిపాడులో పరిశుభ్రతపై అవగాహన ప్రదర్శన

గణపవరం: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత తోనే ఆరోగ్యం చేకూరుతుందని 104 వైద్యాధికారి సంతోష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఫ్రై డే, డ్రై డే కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల కారణంగా అనేక రకాల అంటు వ్యాధులు వ్యాపిస్తున్నాయని, దోమల నిర్మూలన బాధ్యతగా చేపట్టాలన్నారు. దోమలు కుట్టకుండా రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల పరిసరాలలో మురుగునీటి గుంటలు, పాత సామాన్లు, కొబ్బరి బొండాలు వంటివి నిల్వ ఉంచరాదన్నారు. ఈసందర్భంగా గ్రామంలో ప్రదర్శన నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి



సీతంపేట పాఠశాలలో ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ

దెందులూరు: పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెచ్‌ఎం రాజ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం సీతంపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించాయి. కమిటీ సభ్యులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి, నాణ్యమైన భోజన ఏర్పాట్లకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తోట ఎడ్వర్డ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కుందేటి జయరాజు

దెందులూరు: 2016 వికలాంగుల హక్కుల చట్టాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలు చేయాలని దివ్యాంగుల బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కన్వీనర్ కుందేటి జయరాజు అన్నారు. శుక్రవారం దెందులూరు రామాలయం వద్ద వికలాంగుల హక్కుల దెందులూరు మండల జాతీయ వేదిక సమావేశం సీఐటీయూ నాయకులు రంగమ్మ, బీ. ఎన్‌టీఆర్, దెందులూరు మండల అధ్యక్షుడు అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్రంలో ఉన్న దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించాలని కోరారు. సమావేశంలో జాతీయ వేదిక నాయకులు భూషణం, ప్రధాన కార్యదర్శి రంగయ్య, సభ్యులు పాల్గొన్నారు.


గోపన్నపాలెం పీహెచ్‌సీలో స్వచ్ఛభారత్



గోపన్నపాలెం పీహెచ్‌సీలో పరిశుభ్రత చేస్తున్న దృశ్యం

దెందులూరు: గోపన్నపాలెం పీహెచ్‌సీలో పిచ్చి మొక్కలు, తుప్పలతో పీహెచ్‌సీ అంతా అపరిశుభ్రత వాతావరణంతో కనిపిస్తుంది. మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు) కార్యకర్తలతో కలిసి పీహెచ్‌సీలో పిచ్చిమొక్కలు, చెట్లను తొలగించి శుభ్రం చేయించారు. డాక్టర్ రాకేష్‌తో మాట్లాడుతూ వైద్యశాలలో అసౌకర్యాలు, సమస్యలు ఉండే తెలియచేయాలని వాటిని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. పీహెచ్‌సీలో చెట్లు, పిచ్చిమొక్కలు తొలగించిన విలువ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు మండల స్థాయి పోటీలు



మండల స్థాయి పోటీలను నిర్వహిస్తున్న ఎంఈఓ ఎవీఎన్‌వీ ప్రసాద్

దెందులూరు: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మండలంలో అన్ని పాఠశాలల్లో పోటీలు నిర్వహిస్తున్నామని దెందులూరు ఎంఈవో ఏవీఎన్‌వీ ప్రసాద్ అన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి, బహుమతుల అందజేస్తామన్నారు.

ఉపాధి కూలీలకు వేతన పోటు

- కష్టపడ్డాం.. కూలీ ఇవ్వండి
- ఆరు వారాలుగా పైసా విదల్చలేదు
- ఒకొక్కరికి రూ.7 వేల నుంచి రూ.8 వేల బకాయిలు
- నియోజకవర్గంలో రూ.16.56 కోట్ల బకాయిలు



పోలసానిపల్లి మైనర్ ఇరిగేషన్ చెరువు పూడిక తీతకు కొలతలు తీస్తున్న ఉపాధి హామీ సిబ్బంది (ఫైల్)

భీమడోలు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యం బకాయిలతో నీరుగారుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి సొంత ఊరిలోనే వ్యవసాయ కూలీలకు పనులు కల్పించాలన్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం లక్ష్యానికి ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయి. ఆరుగాలం కష్టించి పని చేసిన ఉపాధి కూలీలకు ఆరు వారాలుగా వేతనాలను చెల్లించకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ఒకొక్కరికి చెల్లించాల్సిన రూ.7 వేల నుంచి 8 వేల వరకు వేతనాలు రావాల్సి ఉంది. అవి ఎప్పుడు తమ ఖాతాల్లో జమ అవుతాయోనని వారంతా ఎదురు చూస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అటు పనుల్లేక, చేసిన పనులకు వేతనాలు అందక వారంతా కరవు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. దీంతో కుటుంబ పోషణకు వేరే గ్రామాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని లబోదిబోమంటున్నారు. కనీసం ఉపాధి పథకంలో పనులు చేసి పొట్ట నింపుకుందామన్నా రెండు నెలలుగా పనులను ప్రభుత్వం నిలుపుదల చేసింది. ఉపాధి కూలీల వేతనాలను చెల్లించేందుకు సంబంధిత అధికారులు శ్రద్ధ చూపాలని వారంతా ముక్త కంఠంతో మొర పెట్టుకుంటున్నారు.

మండలం	జాబ్ కార్డులు	కూలీలు	రావాల్సిన బకాయిలు
భీమడోలు	9193	14428	రూ.5.04 కోట్లు
ఉంగుటూరు	9419	14447	రూ.5.11కోట్లు
నిడమర్రు	4061	5425	రూ.2.61కోట్లు
గణపవరం	5254	7308	రూ.3.82కోట్లు

రూ.16.56 కోట్ల వేతన బకాయిలు

ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లో మే నుంచి జూన్ చివరికి ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు రూ.16.56 కోట్ల వేతనాల రూపంలో జమ కావాల్సి ఉంది. నియోజకవర్గంలోని 27,927 కుటుంబాలకు చెందిన రెట్టింపు కూలీలు ఎండ కాలంలో కాలువలు, పంట బోదెలు, చెరువుల పూడిక తీత పనులు చేశారు. కేంద్ర ప్రభుత్వం వారికి రోజుకు రూ.300 వేతనంగా నిర్ణయించింది. గతంలో పని చేసిన కూలీలకు రెండో వారంలో వేతనాలు తమ ఖాతాల్లో జమయ్యేవి. కానీ బీజేపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి వేతనాలు అలస్యంగా ఇవ్వడం పరిపాటిగా మారింది. ఈ ఏడాది మే నుంచి జూన్ చివరి వరకు వేతనాలు ఇవ్వకుండా మరింత జాప్యం చేస్తుండడంతో కూలీలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఉపాధి హామీ పనులకు ఒక్కో కుటుంబంలో ఇద్దరు లేక ముగ్గురు వెళ్లారు. దీంతో కుటుంబంలో రూ.20 నుంచి 25 వేల వరకు బకాయిలు రావాల్సి ఉండడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకంలో ఇప్పటికీ రైతులకు ఒక్క పైసా చెల్లించలేదు. ఈ ఏడాది కొత్త ప్రభుత్వం సుఖీభవ పథకం అమలు చేసే విషయంలో ఇంత వరకూ స్పష్టత ఇవ్వలేదు. ఈ తరుణంలో రైతులు ఖరీఫ్ సాగు పెట్టుబడికి ఉపాధి కూలీ వేతనాలు వాడుకొనేవారు. ప్రస్తుతం ఉపాధి వేతనాలు బకాయి పడడంతో రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి దాపురించింది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు స్పందించి వేతనాల బిల్లులను మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.



పంట బోదె తవ్వకం పనులు చేస్తున్న ఉపాధి కార్మికులు

ఈ వారంలో వేతనాలు జమ



ఈ నెల 14 లోపు ఉపాధి వేతనాలు వారి ఖాతాల్లో జమ చేసేలా ఉన్నతాధికారులు తగు చర్యలు చేపట్టారు. భీమడోలు మండలంలో ఆరు వారాలుగా కూలీలకు వేతనాలు జమ కాలేదు. వారందరికీ ఒకేసారి నగదును వారి ఖాతాల్లో జమయ్యేలా నిధుల విడుదలకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టింది. కూలీలు ఆందోళన చెందనవసరం లేదు. ఈ వారంలో కూలీలందరికి వేతనాలు అందుతాయి. గ్రామ సభల్లో కూలీలకు సమాచారం అందించాం.

– రామిశెట్టి కోదండ రామ్మూర్తి, టెక్నికల్ అసిస్టెంట్, పూళ్ల క్లస్టర్

పేదలకు సంక్షేమ పథకాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీమోర్చ కార్యవర్గ సభ్యుడు పీ.నాగమోహన్

దెందులూరు: ప్రతి గ్రామ శివారు ప్రాంతాల్లో ఉన్న అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు అందించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చ కార్యవర్గ సభ్యుడు పీ.నాగమోహన్, రాష్ట్ర కిసాన్‌మోర్చ కార్యదర్శి ఉండవల్లి వెంకట్రావు అన్నారు. శుక్రవారం గాలాయగూడెంలో మండల బీజేపీ అధ్యక్షుడు మందూరి బుజ్జి గోపాల్ అధ్యక్షతన సమావేశం జరిగింది. కార్యక్రమంలో రైల్వేబోర్డు మెంబర్ గుమ్మడి చైతన్య కృష్ణ, వివిధగ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు రాక

దెందులూరు: మాదిగ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు భిక్షాలు శనివారం ఏలూరు విచ్చేస్తున్నారని యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలపాల సురేష్ తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ ఏలూరు ఇస్రాయేలుపేట కమ్యూనిటీ హాల్‌లో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని విభాగాల నాయకులు విధిగా హాజరు కావాలని సురేష్ కోరారు.

పారదర్శకంగా ఉపాధ్యాయుల సర్దుబాటు



ఉపాధ్యాయ సంఘాల నేతలతో సమావేశమైన ఎంఈవోలు

గణపవరం: గణపవరం, నిడమర్రు మండలాలల్లో జరుగనున్న ఉపాధ్యాయుల సర్దుబాటు పక్రియను పారదర్శకంగా నిర్వహించడానికి ఉపాధ్యాయ సంఘాలు సహకరించాలని గణపవరం, నిడమర్రు మండలాల ఎంఈవో-1 పుచ్చల శేషు, ఎంఈవో-2లు కె.రాంబాబు, గొర్రెల బాలయ్య అన్నారు. శుక్రవారం ఆయా మండలాలలోని ఉపాధ్యాయ సంఘాల నాయకులతో టీచర్ల సర్దుబాటుపై వారు సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మండలంలో సర్‌ప్లస్ టీచర్లను గుర్తించడం, అవసరమైన చోట్లకు క్లియర్ వేకెన్సీలు ఉన్న స్థానాలకు సర్దుబాటు చేయాల్సి ఉందన్నారు. దీనికి సంబంధించి నిబంధనలు రావాల్సి ఉందన్నారు. సర్వీసు సీనియర్, స్టేషన్ సీనియర్ తదితర నిబంధనలు రావలసి ఉందన్నారు. ఎస్‌జీటీలలో సబ్జక్టు ఉపాధ్యాయులను ఆయా ఉన్నత పాఠశాలల్లో అవసరం మేరకు వారి అంగీకారంతో సర్దుబాటు చేస్తామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా సర్దుబాటు ప్రక్రియ ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో గణపవరం నిడమర్రు మండలాల యూటీఎఫ్, ఎస్‌టీయూ, ఏపీటీఎఫ్, పీఆర్‌టీయూ, తదితర సంఘాల నేతలు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి



పొలంబడి కార్యక్రమంలో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న ఏవో ఎస్‌పీవీ ఉషారాణి

భీమడోలు: మేలైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధిస్తారని భీమడోలు మండల వ్యవసాయాధికారిణి డాక్టర్ ఎస్‌పీవీ ఉషారాణి అన్నారు. దుద్దేపూడి గ్రామంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కలిపించారు. పురుగు మందుల వినియోగం, ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించడం వంటి అంశాలపై రైతులకు వివరించారు. వారి అనుమానాలను నివృత్తి చేశారు. పురుగు మందులను వాడడం వల్ల మానవాళిపై వాటి దుష్పరిణామాలను వారికి తెలిపారు. విష ప్రభావంతో కలిగే అనర్థాలను ఛార్ట్‌పై చూపి రైతులను చైతన్యపర్చారు. రైతుల వ్యవసాయ విజ్ఞాన పరిస్థితిని అంచనా వేసేందుకు బ్యాలెట్ బాక్స్ టెస్ట్ నిర్వహించారు. ఆ తర్వాత ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు నిమ్మకాయ కోడిగ్రుడ్డు రసంను రైతుల సమక్షంలో తయారీ చేసి వరి దుబ్బులు పెరగడానికి, చీడపీడలు నశించడానికి దోహదపడతాయని రైతులకు వివరించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు సిఫార్సు చేసిన మేరకు వాడితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొంది ఆర్థిక స్వావలంబన సాధిస్తారన్నారు. తద్వారా పండిన పంటలో పురుగు మందుల అవశేషాలు చేరకుండా ఉంటాయన్నారు. దీనితో పండించిన వరి పంటకు మంచి గిరాకీ లభిస్తుందని, రైతులు అధిక ఆదాయాన్ని సొంతం చేసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రెండు ట్రాన్స్‌ఫార్మర్లకు దిమ్మలు





దెందులూరు గౌడవీధిలో, బస్టాండ్ సెంటరు వైద్యశాల వెనుక కిందకు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు దిమ్మలు ఏర్పాటు చేసిన దృశ్యం

సాక్షి స్పందన

దెందులూరు: మండలంలోని గౌడవీధిలో, బస్టాండ్ సెంటరులోని ఆయుర్వేద వైద్యశాల వెనుక కాలిబాటలో ప్రమాదకర పరిస్థితిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మోక్షం లభించింది. ఇటీవల సాక్షిలో ప్రమాదం అంచున విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అనే శీర్షిక ప్రచురించిన సంగతి విధితమే. విద్యుత్ శాఖ దెందులూరు మండల ఏఈ ఉషారాణి, జూనియర్ ఇంజనీర్ శ్రీనివాస్‌లు స్పందించి వెంటనే రెండు ప్రాంతాల్లో 6 మీటర్ల ఎత్తు దిమ్మ ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్లను ఆ దిమ్మలపై శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేశారు. గౌడవీధి, బస్టాండ్ సెంటరు వాసులు దెందులూరు మండల ఏఈ, జూనియర్ ఇంజనీర్, లైన్ మెన్లకు కృతజ్ఞతలు తెలిపారు.

ముగ్గురు కార్యదర్శులకు గ్రేడ్-2 పదోన్నతి



పదోన్నతి పొందిన కార్యదర్శులను అభినందిస్తున్న డీపీఓ

దెందులూరు: మండలంలో గ్రేడ్-3 కార్యదర్శులుగా పనిచేస్తున్న కార్యదర్శులకు గ్రేడ్-2 కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. శుక్రవారం రాష్ట్ర పంచాయితీరాజ్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దెందులూరు కార్యదర్శి వీఎస్ చౌదరి, సోమవరప్పాడు కార్యదర్శి ఎం. శ్రీకాంత్, రామారావుగూడెం గ్రామానికి చెందిన కాలి సుజాతలకు పదోన్నతి పత్రాలను డీపీఓ అందజేసి అభినందించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ ఫ్యాక్టరీ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

పెదవేగి: పెండింగ్‌లో ఉన్న బోనస్ ఇవ్వాలని కోరుతూ శుక్రవారం మహిళా కార్మికులు గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ ఫ్యాక్టరీ వద్ద వంగూరులో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ 2024 మార్చిలో కార్మికులకు ఇవ్వాల్సిన బోనస్ ఇప్పటి వరకు యాజమాన్యం చెల్లించలేదన్నారు. మహిళా కార్మికులు ఎక్కువ మంది ఉన్న ఈ ఫ్యాక్టరీలో సమస్యల పరిష్కారానికి యాజమాన్యం రాకపోతే డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేస్తామన్నారు. యాజమాన్యం తరపున నాగేశ్వరరావు వచ్చి నాలుగు రోజులు సమయం కావాలని కోరి వెంటనే హైదరాబాద్‌లో ఉన్న యాజమాన్యంతో ఫోన్‌లో చర్చలు అనంతరం మహిళా కార్మికులు ధర్నాను విరమించారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు



బాధితురాలిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: జాతీయ రహదారిపై కైకరం డివైడర్ సమీపంలో మోటారు సైకిల్ జారిపడిన ప్రమాదంలో ఎనికేపల్లికి చెందిన భార్యాభర్తలకు గాయాలు అయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో దుర్గం పెద్దిరాజు (72)కు, అతని భార్య పల్లాలు (66)కు గాయాలు అయ్యాయి. హైవే అంబులెన్సులో తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు.

ఉంగుటూరు ఎంఈవో-2గా భాస్కర్



భాస్కర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఉంగుటూరు ఎంఈవో-2గా శుక్రవారం భాస్కర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన శ్రీనివాసరావు రిటైరు అయిన విషయం తెల్సిందే. ఉప విద్యాశాఖాధికారి నిమ్మగడ్డ రవీంద్ర భారతి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో-2 శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెదపాడు: పురుగుమందు సేవించి మహిళ మృతి చెందిన సంఘటన పెదపాడు మండలంలోని ఏపూరులో చోటు చేసుకుంది. పెదపాడు మండలంలోని ఏపూరు గ్రామానికి చెందిన అమలాపురం వెంకట నర్సమ్మ (42)కు మానసిక స్థితి బాగోలేకపోవడంతో గురువారం సాయంత్రం పురుగుమందు సేవించింది. దీంతో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మరణించింది. తల్లి బెజవాడ వీరమ్మ ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్‌ఐ శుభశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది

భీమడోలు: శ్రీ వేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం గుండుగొలను పీహెసీ వైద్య సిబ్బంది విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి పలు సూచనలు చేసి, మందులను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్స్ వంగా నాగేశ్వరరావు, బొమ్ము రవి కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ మార్పుల నేపథ్యంలో డెంగీ జ్వరాలు ప్రబలే అవకాశాలున్నాయని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డీఎంబీబీ సింగ్, ఎన్ఎస్ఎస్ పీవోలు జి.నాగరాజు, బొమ్ము శశికాంత్, వైద్య ఆరోగ్య సిబ్బంది టి.మురళీ కృష్ణ, జే.చంద్రకళ, సిబ్బంది, ఆశవర్కర్లు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

జంగారెడ్డిగూడెం: క్విట్ ఇండియా పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ పిలుపునిచ్చారు. స్థానిక బోసు బొమ్మ సెంటర్లో ఐఎఫ్‌టీయూ డివిజన్ కార్యదర్శి మంచిలి రాజు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో రమణ మాట్లాడారు. విదేశీ బహుళజాతి కంపెనీలు భారత్ నుంచి వైదొలగాలని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు కొనే ఎరువులు పురుగుల మందులు విత్తనాలు వ్యవసాయ పరికరాలు అన్నింటికీ ప్రభుత్వం ధరలు నిర్ణయిస్తుంటే రైతు పండించిన పంటకు ఎందుకు గిట్టుబాటు ధర చట్టం చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో గంపల శ్రీను, మద్దిపాటి లక్ష్మయ్య, మర్రి రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయండి

చింతలపూడి: వ్యవసాయ వినాశకర బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఉప సంహరించుకోవాలని అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద శుక్రవారం వారు ఆందోళన నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, మండల అధ్యక్షుడు ఎస్‌కే కాలేష, వివిధ సంఘాలు, పార్టీల నాయకులు డి.రంగనాథ్, ఎస్ సూర్యకుమార్, కె గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ వ్యతిరేక బిల్లు ఉపసంహరించుకోవాలి

కామవరపుకోట: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయంపై వినాశకర వ్యవసాయ బిల్లులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ మండల కన్వీనర్ టీవీఎస్ రాజు డిమాండ్ చేశారు. స్థానిక చౌతన సెంటర్లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ, ఏఐటీయూసీ, ముఠావర్కర్ నాయకులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి పాలాభిషేకం, అలంకరణ దృశ్యాలు

దెందులూరు: మండలంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి పాలాభిషేకం, విశిష్ఠ పూజలు చేశారు. శనివారం స్వామివారి ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహావిష్కరణ జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. గ్రామ నాయకులు ఇప్పిలి వెంకటేశ్వరరావు, రామదండు మండల నాయకులు సుగ్గిశెట్టి నూకరాజు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పూజలు నిర్వహించారు.

తల్లి పాల ప్రాముఖ్యతను వివరించాలి

ఉంగుటూరు: తల్లిపాలు ప్రాముఖ్యతను అంగన్‌వాడీ కార్యకర్తలు, మెడికల్ సిబ్బంది ప్రజలకు తెలియజేయాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సామట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం ఉంగుటూరు మండలం చేబ్రోలులో తల్లిపాల వారోత్సవాల్లో ధర్మరాజు పాల్గొని మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంత శ్రేయస్కరమో అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. సర్పంచి రందే సునీత, రందేరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.